

## మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలి: వంగపల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి, వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను నిర్లక్ష్యం చేసి, అవమానించిందని మండిపడ్డారు. ప్రభుత్వం తరపున పత్రికలలో ప్రకటన కూడా ఇవ్వలేదని తెలిపారు. మనుషులంతా సమానమనే భావన వచ్చినప్పుడే నిజమైన సమతారాజ్యం వస్తుందని, అదే జగ్జీవన్‌రాంకు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో పొట్టపెంజర రమేశ్, శాంతికిరణ్, చాప కృష్ణ, రాజేశ్‌ఖన్నా, కొల్లూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# 'పాలమూరు' పనులకు పచ్చజెండా

- ఎట్టకేలకు రాష్ట్ర సర్కారులో కదలిక
- సాగునీటి మంత్రి ఉత్తమ్ సమీక్ష
- ప్యాకేజీ 3 కెనాల్ పనులతోపాటు రిజర్వాయర్లు పూర్తికి ఆదేశం
- 'నమస్తే' కథనానికి స్పందన



హైదరాబాద్, ఏప్రిల్5 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారులో కదలిక వచ్చింది. 'నమస్తే తెలంగాణ' కథనంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల సాగునీటి పథకం (పీఆర్‌ఎల్‌ఐఎస్) పనులను చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్యాకేజీ 3 పనులతోపాటు రిజర్వాయర్లను పూర్తిచేయాలని అధికారులకు తాజాగా ఆదేశాలు జారీచేసింది. పీఆర్‌ఎల్‌ఐఎస్ పనులను కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే దాదాపు పూర్తిచేసింది. రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌ల నిర్మాణం పూర్తయింది. కల్వకుర్తి ఆయకట్టుకు సైతం ప్రాజెక్టును అనుసంధానం చేసింది. నార్లాపూర్‌లో ఎత్తిపోతలను కూడా ప్రారంభించింది. ప్యాకేజీ 3లో అంటే అంజనగిరి (నార్లాపూర్) రిజర్వాయర్ నుంచి వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ వరకు జలాలను తరలించే కెనాల్ పనులు కొద్దిగా మాత్రమే మిగిలి ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ సర్కారు ఆయా పనులను అసలే పక్కకు పెట్టింది. ఇతర కాల్వల టెండర్లను సైతం రద్దుచేసింది. ఈ నేపథ్యంలోనే 'పాలమూరుపై పగ.. కల్వకుర్తి దగా' పేరిట ఇటీవల నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సెక్రటేరియట్‌లో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఆ శాఖలోని ఇతర సీనియర్ అధికారులతో చర్చించారు. పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.

### సమీక్షలో కీలక నిర్ణయాలు

ప్రాజెక్టు పనులను డిసెంబర్ 2025 నాటికి పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష అనంతరం ఆదేశించారు. ప్యాకేజీ3 కాల్వ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రాజెక్టులోని రిజర్వాయర్లు అన్నింటినీ డిసెంబర్ నాటికి సిద్ధంచేసి 50 టీఎంసీల నీటిని నింపేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏదుల, వట్టెం పంపింగ్ స్టేషన్ల డ్రైరన్ నిర్వహించాలని ఆదేశించారు. జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టాలని, రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యాన్ని 12 టీఎంసీలకు పునరుద్ధరించాలని నిర్ణయించారు.

## కేంద్రం వైఖరి గర్హనీయం: పెన్షనర్స్ జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): పెన్షనర్లతో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి గర్హనీయమని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి(పెన్షనర్స్ జేఏసీ) ప్రకటించింది. కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించిన సెంట్రల్ సర్వీసెస్(పెన్షన్) రూల్స్ చట్టాన్ని ఖండిస్తున్నట్టు ప్రకటించింది. పెన్షనర్స్ జేఏసీ సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, వెంటనే ఉపసంహరించుకోవాలని జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ శుభాకర్‌రావు డిమాండ్ చేశారు.

### '13న చలో ఇందిరాపార్క్'

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు కోసం సెకండరీ ఎస్టీటీయూ 13న చలో ఇందిరాపార్క్‌కు పిలుపు ఇచ్చింది. ఎస్టీటీయూ రాష్ట్ర కార్యవర్గం అత్యవసర సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలు సహా బిల్లులు మంజూరుచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని, మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను అమలుచేయాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

## సచివాలయంలో మళ్లీ నకిలీలు!

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో నకిలీ ఉద్యోగుల సమస్య ఉన్నతాధికారులకు కనుకులేకుండా చేస్తున్నది. శనివారం సచివాలయ భద్రతా సిబ్బంది వైఫల్యం బహిర్గతమైంది. మంత్రులతో ముఖ్యమంత్రి సమావేశం జరుగుతుండగా ఇద్దరు నకిలీ ఉద్యోగులు లోపలికి వెళ్లినట్టు తెలిసింది. వారు ఆరో ఫ్లోర్‌కు వెళ్లేందుకు తచ్చాడుతుండగా.. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నట్టు సమాచారం. వారిద్దరిని పరిశీలించగా, ఫేక్ ఐడీకార్డులతో సెక్రటేరియట్‌లోకి ప్రవేశించారని గుర్తించారు. విషయం బయటికి పొక్కకుండా పోలీసు సిబ్బంది, సచివాలయ సెక్యూరిటీ విభాగం దాచిపెట్టినట్టు తెలిసింది. సచివాలయ సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యం వల్లే తరచూ సచివాలయంలో నకిలీ ఉద్యోగులు ప్రవేశిస్తున్నారు. నిరుడు కూడా పలువురు ఫేక్ ఐడీ కార్డులతో సచివాలయంలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే.

## హామీలు నెరవేర్చకుంటే సమ్మె తప్పదు

- ఆర్టీసీ జాక్ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి



కరీంనగర్ తెలంగాణచౌక్, ఏప్రిల్ 5 : ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో సమ్మె తప్పదని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జాక్ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్‌లో శనివారం జిల్లా కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తామని, కొత్త బస్సులను కొనుగోలు చేసి సంస్థను లాభాల బాటలోకి తీసుకొస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే నిర్వీర్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనవరి 7న సమ్మె నోటీసు ఇచ్చామని, లేబర్ కమిషన్ చర్చలకు పిలిచినా ప్రభుత్వం, యాజమాన్యం రావడం లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో 3800 ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించినా ఇప్పటి వరకు పురోగతి లేదన్నారు. ఈవీ బస్సుల కొనగోలుకు కేంద్రం అందిస్తున్న సబ్సిడీని కార్పొరేట్ కంపెనీలకు చెల్లిస్తున్నదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ఈ నెల 7న లేబర్ కమిషన్ కార్యాలయం ఎదుట నిర్వహించే భారీ సభలో సమ్మె తేదీని ప్రకటిస్తామని స్పష్టంచేశారు.

## బాబూ జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం

రవీంద్ర భారతి,ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకొని శనివారం బషీర్‌బాగ్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. జగ్జీవన్‌రాం అడుగుజాడల్లో యువత నడవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు వీ హనుమంతరావు, అంజన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి , మాజీ కార్పొరేటర్లు మమతాసంతోష్‌గుప్తా, పరమేశ్వరీసింగ్ పాల్గొన్నారు.

### డెహ్రాడూన్‌లో 'చింతన్ శివిర్'

హైదరాబాద్, ఏప్రిల్5 (నమస్తే తెలంగాణ): సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఆధ్వర్యంలో డెహ్రాడూన్‌లో 'చింతన్ శివిర్' ఈనెల 7,8న నిర్వహించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, సీనియర్ సిటిజన్లు, మద్యపాన వ్యసనపరులు, మాదకద్రవ్యాల బాధితులు, లింగమార్పిడి వ్యక్తులు, యాచకులు, మాన్యువల్ స్కావెంజర్స్, సంచార తెగలు, దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్రం, రాష్ట్రాలు అమలు చేస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాలపై చింతన్ శివిర్‌లో చర్చిస్తారు. కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల సంక్షేమశాఖల మంత్రులు హాజరుకానున్నారు. దీనిలోభాగంగానే రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

# రాజాసింగ్‌పై త్వరలో సస్పెన్షన్ వేటు!

- రాష్ట్ర నేతలపై వరుస వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో..
- క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కమిటీ ఫైల్ సిద్ధం!
- రెండు రోజుల్లో హైకమాండ్‌కు నివేదిక పంపేలా ఏర్పాట్లు



హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమైందా? రాష్ట్ర నేతలపై వరుస వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై చర్యలకు రాష్ట్ర కమిటీ ఫైల్ సిద్ధం చేసిందా? ఆ ఫైల్‌ను రెండ్రోజుల్లో హైకమాండ్‌కు పంపనున్నదా? అంటే బీజేపీ వర్గాల నుంచి అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీలో అగ్గి రాజేస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని రాష్ట్ర కమిటీ నియమిస్తే రబ్బర్ స్టాంప్‌గానే మిగిలిపోతాడని, గతంలో ఉన్న అధ్యక్షుడు గ్రూప్‌లు కట్టారని, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ ముఖ్యమంత్రిని కొందరు బీజేపీ ముఖ్య నేతలు రహస్యంగా కలుస్తారని రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును ప్రకటించడంపై రాజాసింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా గులాంగిరి చేసేవారికే పోస్టులు, టికెట్లు ఇస్తారా? అని ప్రశ్నించారు. వరుసగా పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడుతున్న రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పార్టీ శ్రేణుల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాష్ట్ర నాయకత్వం భావించి ఫైల్ సిద్ధం చేసినట్టు సమాచారం. మరో రెండ్రోజుల్లో ఈ ఫైల్‌ను హైకమాండ్‌కు పంపనున్నట్టు, వారం రోజుల్లో సస్పెన్షన్ వేటు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# 30వేల మంది ఔట్‌సోర్సింగ్ అవుట్

- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో కోతలు

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ) : కొత్త నియామకాల్లేవు.. జాబ్ క్యాలెండర్ అటకెక్కింది.. ఒక్క నోటిఫికేషన్ ఇచ్చింది లేదు.. కానీ ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్రలకు పాల్పడుతున్నది. అరకొర వేతనంతో కాలం వెళ్లదీసే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించేందుకు పావులు కదుపుతున్నది. 25-30 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు సమాచారం. ఇందుకు పీఆర్సీ చైర్మన్ శివశంకర్, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ నాగేశ్వర్‌రావుతో కమిటీ వేసినట్టు తెలిసింది. ఈ కమిటీ రాష్ట్రంలో 4.94 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పనితీరు, ఏజెన్సీలపై అధ్యయనం చేసి, 30 రోజుల్లో నివేదిక అందించనున్నది. ఇటీవల 54 వేల పైచిలుకు ఉద్యోగాలను కొత్తగా భర్తీచేయగా, వీరికి పలు శాఖల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. జేఎల్స్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఆయా స్థానాల్లో పనిచేస్తున్న 25-30వేల మందిపై సర్కారు వేటు వేయబోతున్నది. దీంతో వారు దిన దిన గండంగా గడుపుతున్నారు. కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటుతోపాటు ఇటీవల కొత్తగా కాలేజీలు మంజూరుచేశారు. వీటికి ఎలాగు కొత్తపోస్టులు మంజూరుచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉన్నవారిని తొలగించడానికి బదులు, వారిని ఆయా స్థానాల్లో నియమించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయానికి గ్రీన్‌సిగ్నల్

- రక్షణ శాఖ ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకొస్తాం
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్‌లోని రక్షణ శాఖకు చెందిన విమానాశ్రయంలో పౌరవిమాన యాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పౌరవిమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్టు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రాసిన లేఖలో రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు.

### విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెస్తే..

పత్తి వ్యాపారానికి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు ఆదిలాబాద్ ప్రధానమైన కేంద్రంగా ఉండటమే కాకుండా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎంతో కాలంగాఉంది. గతంలో బీఆర్‌ఎస్ దీనిపై అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. ఆదిలాబాద్‌లో గతంలోనే విమానాశ్రయం ఉండేది. ఇప్పుడు ఈ విమానాశ్రయాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకొస్తే రక్షణ శాఖతోపాటు పౌర సేవలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

### వాణిజ్యాభివృద్ధికి దోహదం

ఇటీవల వరంగల్ విమానాశ్రయానికి కేంద్రం అనుమతులు లభించాయి. విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం త్వరగా పూర్తి చేస్తే మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయవచ్చు. రీజనల్ కనెక్టివిటీ స్కీమ్- ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్(ఆర్‌సీఎస్-యుడీఏఎన్) పథకంలో భాగంగా 620 రూట్లలో ఇప్పటికే హైదరాబాద్‌కు 60 రూట్లు (10%) ఆపరేషన్‌లో ఉన్నాయి. వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల సేవలు ప్రారంభమైతే తెలంగాణకు 'ఉడాన్' కింద మరికొన్ని రూట్లు అందుబాటులోకి వస్తాయి. పౌరసేవలతోపాటు వాణిజ్యాభివృద్ధికి దోహదపడతాయి.

## వాణిజ్య



### హోండా సరికొత్త బైకులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి నయా బైకులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతేడాదికిగాను సీబీ350, సీబీ350 హెచ్‌నెస్, సీబీ350ఆర్‌ఎస్ మోటర్‌సైకిళ్లను పరిచయంచేసింది. మూడురకాల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.2.10 లక్షలుగా నిర్ణయించింది. వీటిలో సీబీ350ఆర్‌ఎస్ మాడల్ రూ.2.10 లక్షలు కాగా, డీఎల్‌ఎక్స్‌ప్రో రూ.2.15 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు మోటర్‌సైకిళ్లు నూతన ఉద్గార మార్గదర్శకాలకు లోబడి తయారు చేసింది. 348.36 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ఎయిర్ కూల్డ్, సింగిల్ సిలిండర్‌తో రూపొందించింది. ప్రస్తుతం మార్కెట్లో స్పోర్ట్స్ బైకులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా బైకులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

### బ్యాటరీ ఎలక్ట్రిక్‌తో ఈవీ91 జట్టు

నూఢిల్లీ, ఏప్రిల్ 5: ఎలక్ట్రిక్ వాహనాల అగ్రిగేటర్ ఈవీ91 టెక్నాలజీస్..ఈవీకి సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి 'బ్యాటరీ ఎలక్ట్రిక్'తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా దేశీయంగా ఈవీల వినిమయాన్ని పెంపొందించడానికి కృషి చేయడంతోపాటు కొనుగోలుదారులకు ఆర్థిక సేవలు, రెంటల్స్, దీర్ఘకాలిక సబ్‌స్క్రిప్షన్ అందించనున్నాయి. భాగస్వామ్యులకు, కార్పొరేట్ క్లయింట్లకు, బీ2బీలకు 10 వేల ఎలక్ట్రిక్ వాహనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వీటిలో ఇప్పటి వరకు వెయ్యికి పైగా ఆర్డర్లు వచ్చాయి.

### జపాన్ పర్యటనకు సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి జపాన్‌కు వెళ్లనున్నారు. ఈ నెల 15న జపాన్ వెళ్లనున్న సీఎం.. ఐదు రోజుల పాటు అక్కడే పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కంపెనీలతో పెట్టుబడులపై చర్చించనున్నారు.

# కేసీఆర్ హయాంలో పాడి, పౌల్ట్రీ జోరు

- పదేండ్లలో భారీగా పెరిగిన ఉత్పత్తి
- వ్యవసాయాధారిత రంగాల్లో జోష్
- సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడి





హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ పంటలతోపాటు పాడి, పౌల్ట్రీ రంగాలు భారీ ఉత్పత్తిని నమోదు చేశాయి. మటన్, చికెన్ సైతం గణనీయమైన ఉత్పత్తిని రికార్డు చేశాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ విశేష ప్రగతిని సాధించింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్ వ్యవసాయం, వ్యవసాయాధార రంగాలకు పెద్ద పీట వేయడమే ఇందుకు కారణం. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆవులు, బర్రెల కొనుగోలు భారీ ఎత్తున సబ్సిడీలు ఇచ్చి పాడి రైతులను ప్రోత్సహించింది. గొల్ల-కురుమల సంక్షేమానికి గొర్రెలు, మేకలను పంపిణీ చేసింది. ప్రజల ఉపాధి కోసం పెద్ద ఎత్తున కోళ్ల పెంపకందారులకు భారీగా సబ్సిడీలు అందజేసింది. దీంతో రాష్ట్రంలో అనేకమందికి పాడి, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం ప్రధాన వృత్తిగా మారింది. రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమ క్రమంగా ప్రగతిని సాధించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నాటికి రాష్ట్రంలో కేవలం 3,924.14 లీటర్ల పాల ఉత్పత్తి ఉండేది. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో అది 2024 నాటికి 5,839.56 లీటర్లకు పెరిగింది.

### తగ్గిన మాంసం దిగుమతులు

పశు సంపద వృద్ధి చెందడంతో చర్మకార పరిశ్రమకు ముడి సరుకు లభిస్తున్నది. పశువులు, గొర్రెలు, మేకల పెంపకం పాలు, మాంసాహార అవసరాలను తీర్చేలా వృద్ధిచెందింది. వ్యవసాయంతోపాటు రైతాంగానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నది. ప్రభుత్వం సామాజిక వర్గాల వారీగా పశుసంపదను పంపిణీ చేసింది. దీంతో ఆయా వృత్తికులాల ఆదాయం పెరిగింది. ఉత్పత్తి భారీగా నమోదవుతున్నది. రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. గొల్ల కురుమలకు గొర్రెలు, మేకల యూనిట్ల పపిణీతోపాటు ముదిరాజ్, బెస్తలకు చెరువుల్లో చేపల పెంపకాన్ని కేసీఆర్ సర్కార్ పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. సామాజిక వర్గాల వారీగా బర్రెలు, ఆవులను పంపిణీ చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఆయా వర్గాల్లో ఉపాధి రంగం మెరుగుపడిందని తాజా సామాజిక, ఆర్థిక గణాంకాలు వెల్లడించాయి.

**2013-14 నుంచి 2024-25 వరకు రాష్ట్రంలో పాలు, మాంసం, గుడ్డు ఉత్పత్తుల వివరాలు**

| సంవత్సరం | పాలు (మెట్రిక్ లీటర్లు) | మాంసం,చికెన్ (టన్నులు) | గుడ్లు (లక్షలు) |
|---|---|---|---|
| 2013-14 | 3,924.14 | 230.29 | 1,00,605.98 |
| 2014-15 | 4,207.26 | 505.05 | 1,06,185.33 |
| 2015-16 | 4,442.45 | 542.05 | 1,12,058.23 |
| 2016-17 | 4,681.09 | 591.04 | 1,18,186.35 |
| 2017-18 | 4,965.37 | 645.03 | 1,26,700.02 |
| 2018-19 | 5,416.13 | 754.06 | 1,36,868.43 |
| 2019-20 | 5,590.21 | 848.16 | 1,48,055.17 |
| 2020-21 | 5,765.19 | 920.25 | 1,58,469.75 |
| 2021-22 | 5,807.78 | 1,004.95 | 1,66,708.39 |
| 2022-23 | 5,854.78 | 1,080.62 | 1,76,706.62 |
| 2023-24 | 6,160.99 | 1,172.04 | 1,86,425.28 |
| 2024-25 (జనవరి వరకు) | 5,839.56 | 1,112.74 | 1,83,850.16 |






## డెలివరీ చేతికి ఈకామ్ ఎక్స్‌ప్రెస్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: సరుకు రవాణాలో అగ్రగామి సంస్థగా వెలుగొందడానికి డెలివరీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీంట్లోభాగంగా తన పోటీ సంస్థయైన ఈకామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఒప్పందం విలువ రూ.1,407 కోట్లు. షేర్ల కొనుగోలు ద్వారా జరగనున్న ఈ ఒప్పందం వచ్చే ఆరు నెలల్లో పూర్తికానున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలు ఒప్పందానికి కంపెనీ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు, కొనుగోలు అనంతరం ఈకామ్ సంస్థ యథావిధిగానే తన సేవలను కొనసాగించనున్నదని, అలాగే సబ్సిడరీగా కొనసాగుతుందని డెలివరీ ఎండీ, సీఈవో సైద్ సాహిల్‌బారు తెలిపారు. ఇరు సంస్థల క్లయింట్లకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్టు... మౌలిక సదుపాయల కల్పన, టెక్నాలజీ, నెట్‌వర్క్, ఉద్యోగాలను నియమించుకోవడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్టు ఆయన ప్రకటించారు.

# అంతర్జాతీయ మార్కెట్‌లో మిర్చికి డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ వంటి మార్కెట్‌లో మిర్చి ధరలు ఊపందుకున్నాయి. ఖమ్మంలో ముఖ్యంగా తేజా రకం మిర్చికి పెరుగుతున్న డిమాండ్ వల్ల ధరలు స్థిరంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం రోజువారీగా 19,000 నుంచి 20,000 క్వింటాళ్ల వరకు మిర్చి మార్కెట్లోకి వచ్చేస్తోంది. గత నెల వరకు కేవలం రూ.11,000 నుంచి రూ.12,000 వరకు పలికిన ధరలు.. ప్రస్తుతం గరిష్టంగా రూ.13,500 వరకు చేరుకున్నాయి.మోడల్ ధరలు కూడా రూ.11,500 నుంచి రూ.12,000 మధ్య ఉన్నాయి.వరంగల్ మార్కెట్‌కి రోజుకు సుమారు 6,000 క్వింటాళ్ల మిర్చి చేరుకుంటోంది. అక్కడ కూడా ధరలు రూ.12,000 నుంచి రూ.13,000 మధ్య ఉన్నాయి. వండర్ హాట్ రకం మిర్చి 2,800 క్వింటాళ్లకు పైగా మార్కెట్‌కు చేరుకుంటున్న నేపథ్యంలో.. ధరలు రూ.14,000 నుంచి రూ.15,500 మధ్య ఉండడం గమనార్హం. అలాగే యుఎస్ 341 రకం మిర్చికి సుమారు 6,000 క్వింటాళ్ల డిమాండ్ ఉండగా.. ధరలు రూ.12,000 వరకు పెరిగాయి. హైదరాబాద్ మలక్ పేట్ మార్కెట్‌కి మాత్రం తక్కువ మొత్తంలోనే మిర్చి వస్తోంది. సుమారు 1,000 క్వింటాళ్లలోపు చేరుతోంది.



వరంగల్, ఖమ్మం మార్కెట్‌లోకి పోటెత్తిన ఎర్ర బంగారం

కొన్ని నెలలుగా నిలకడగా కొనసాగిన మిర్చి ధరలు తాజాగా పెరుగుతుండటంతో రైతులకు కొంత ఊరట లభించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్, దేశీయంగా కూడా కొనుగోళ్ల పెరుగుదల కారణంగా మార్కెట్‌లో అత్యధికంగా నమోదు అవుతోంది. నాణ్యమైన మిర్చికి కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తుండటంతో.. క్వింటాల్‌కు సగటున రూ.300 నుంచి రూ.500 వరకు ధర పెరిగే అవకాశముంది. మిర్చి ధరల పెరుగుదల వెనుక ప్రధాన కారణంగా ఎగుమతులు సజావుగా సాగుతుండటమేనని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. దేశీయంగా కూడా ఆహార ప్రాసెసింగ్ కంపెనీలు అధిక మొత్తంలో మిర్చిని కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మిర్చి రైతులు ఈ కొత్త ధరలతో కొంత ఉపశమనం పొందుతున్నారు. పండించిన మిర్చికి తగిన ధర లభిస్తుండటంతో వచ్చే నెలల్లో కూడా మార్కెట్ ధరలు మెరుగవుతాయనే విశ్వాసం రైతుల్లో నెలకొంది. అయితే.. వచ్చే రోజుల్లో వాతావరణ పరిస్థితులు, దిగుబడి స్థాయిపై ఆధారపడి ధరలు ఎలా మారుతాయో చూడాలి. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం.. మరి కొన్ని వారాల పాటు ధరలు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశముందని చెబుతున్నారు.

# 91 వేల దిగువకు బంగారం



హైదరాబాద్, ఏప్రిల్ 5: బంగారం ధరలు క్రమంగా శాంతిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలు భారీగా తగ్గడంతో దేశీయంగా వరుసగా మూడోరోజు దిగొచ్చింది. శనివారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం ధర రూ.980 తగ్గి రూ.91 వేల దిగువకు రూ.90,660కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.91,640గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.900 దిగొచ్చి రూ.83,100కి పరిమితమైంది. బంగారంతోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో కిలో వెండి రూ.5,000 తగ్గి రూ.1.03 లక్షలకు చేరుకున్నది.

# స్టార్టప్‌లకు 10 వేల కోట్ల ప్రత్యేక ఫండ్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: నిధులు లేక సతమతమవుతున్న స్టార్టప్‌లను ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేయబోతున్నది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న స్టార్టప్ మహాకుంభ్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని, దీంట్లోభాగంగా సిడ్బీ ప్రత్యేకంగా చిన్న స్థాయి స్టార్టప్‌లకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంటర్‌ప్రెన్యూర్‌ల తమ ఆలోచనలు అమలులోకి వచ్చేందుకు సిడ్బీ ప్రత్యేకంగా కృషి చేయాలని, ముఖ్యంగా ప్రతి రాష్ట్రంలో ఒక సెంటర్‌ను నెలకొల్పాలని ఆయన సూచించారు.

# అమెరికా సుంకాలతో మనకు మేలే

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ): విదేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం మనకు మేలే చేస్తున్నదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ కీలక సమయంలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపు చూసే అవకాశాలున్నాయని, ఈ పరిణామాన్ని మనకు అనుకూలంగా మార్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. శనివారం గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం(జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ''ఇండియా - లాటిన్ అమెరికా, కరీబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్'' రెండో ఎడిషన్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా స్థానిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులకు సూచించారు. ప్రభుత్వం తరపున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వారికి వివరించారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషించనున్నదనే ఆశాభావం వ్యక్తంచేశారు. ఎంఎస్ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటేలా ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు 6 అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకొచ్చాయని, వీటిలో మూడు కొరియా కంపెనీలు కూడా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు.

# డాటా డౌన్‌లోడ్‌లో జియో టాప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. 5జీ డౌన్‌లోడ్‌లో అగ్రస్థానంలో నిలిచినట్టు ఓక్లా స్పీడ్‌టెస్ట్ ఇంటెలిజెన్స్ డాటాలో వెల్లడించింది. గతేడాది జూలై-డిసెంబర్ మధ్యకాలంలో సెకన్‌కు 258.54 మెగాబైట్ల డాటా డౌన్‌లోడ్ అయిందని తెలిపింది. తన పోటీ సంస్థ ఎయిర్‌టెల్ డౌన్‌లోడ్ 205.1 ఎంబీపీఎస్‌తో రెండో స్థానంలో నిలిచినట్టు పేర్కొంది.